ఇంటింటా 'పల్స్ పోలియో'

నిర్మల్ చైన్‌గేట్: మాటేగాం వద్ద పోలియో చుక్కల పంపిణీ పరిశీలిస్తున్న అధికారులు

భైంసా టౌన్: మహాగాంలో పోలియో చుక్కలు వేస్తున్న వైద్యాధికారి శృతి

నిర్మల్ చైన్‌గేట్, మార్చి, 4: జిల్లా వ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖాధికారులు సోమవారం ఇంటింటా పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం పోలియో చుక్కలు వేయించుకోని వారికి వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. నిర్మల్ పట్టణం లోని రాంనగర్ దవాఖాన పరిధిలో సీడీపీవో నాగమణి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో ఏసీడీపీవో నాగలక్ష్మి, సూపర్‌వైజర్ సావిత్రి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'పోలియో' పంపిణీ పరిశీలన

జిల్లాలో పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర నోడల్ అధికారులు సోమవారం పరిశీలించారు. నిర్మల్ పట్టణంలోని వైఎస్సార్ నగర్, భైంసా మండలంలోని మాటేగాం, సారంగాపూర్ మండలంలోని చించోలి(బీ)గ్రామాలను సందర్శించి, పోలియో చుక్కల పంపిణీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వ్యాధి నిరోధక టీకాల అధికారి నయనారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలియో చుక్కలపై ఆరా

భైంసాటౌన్, మార్చి 4 : ఆదివారం ప్రారంభించిన పల్స్‌పోలియో కార్యక్రమంలో పిల్లలందరికీ పోలియో చుక్కలు వేశారో లేదో అని సోమవారం స్టేట్ టీం ఆరా తీశారు. సోమ, మంగళవారాల్లో ఇంటింటికీ వెళ్లి మిగిలిన పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని సూచించారు. మండలంలోని ఇటుకబట్టీలు, కార్మిక వాడలకు వెళ్లి పోలియో చుక్కల పంపిణీ వివరాలను కార్మికులకు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్టేట్ అబ్జర్వర్లు పృథ్వీరాజ్, డేవిడ్, డీఐవో నైనారెడ్డి, సీహెచ్‌వో గిరిబాబు, డీపీఎంవో గంగన్న, హెచ్‌ఈవో సలీం, హెచ్ ఏఈ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

చుక్కలు వేయించాలి

దస్తురాబాద్, మార్చి 4 : 5 సంవత్సరాల లోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని పీహెచ్‌సీ డాక్టర్ చందన సూచించారు. సోమవారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో రెండో రోజు ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేశారు. ఇక్కడ హెచ్‌ఈవో వేణుగోపాల్, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

దస్తురాబాద్ : పోలియో చుక్కలను పంపిణీ చేస్తున్న డాక్టర్ చందన



ఖానాపూర్: దరఖాస్తులను స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం

ప్రజాపాలన సేవా కేంద్రాలు ప్రారంభం

ఖానాపూర్, మార్చి 4 : ఖానాపూర్ మన్సిపల్ కార్యాలయంలో సోమవారం ప్రజాపాలన సేవా కేంద్రాన్ని చైర్మన్ రాజురా సత్యం ప్రారంభించారు. ప్రభుత్వ ఆరు గ్యారంటీలకు సంబంధించిన తప్పులను సరిదిద్దుకోవడానికి అర్హులు దరఖాస్తులు సమర్పించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కావలి సంతోష్, కౌన్సిలర్ తొంటి శ్రీనివాస్, నాయకులు శంకర్, అమానూల్లా ఖాన్, సురేశ్, షబ్బీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో

కుంటాల, మార్చి, 4: ప్రభుత్వం అందిస్తున్న పథకాల దరఖాస్తులు స్వీకరించడానికి మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఇన్‌చార్జి ఎంపీడీవో రహీం సోమవారం ప్రారంభించారు. ఇటీవల ప్రవేశపెట్టిన గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలకు దరఖాస్తు చేసుకోని వారు తెల్లరేషన్ కార్డు, ఆధార్‌కార్డు, కరెంటు బిల్లులతో కేంద్రానికి వచ్చి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలన్నీ ప్రజాపాలన వెబ్ పోర్టల్‌లో పొందుపరచనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ నవీన్, డేటా ఎంట్రీ ఆపరేటర్ శిరీష ఉన్నారు.

నిర్మల్ మున్సిపల్ కార్యాలయంలో..

నిర్మల్ అర్బన్, మార్చి 4 : నిర్మల్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ప్రజా పాలన సేవా కేంద్రాన్ని అధికారులు సోమవారం ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహ జ్యోతి, మహాలక్ష్మి పథకంలో దరఖాస్తులను సమర్పించడంలో జాప్యం చేసినవారు, పథకాలకు అర్హులైన వారు లబ్ధిపొందేందుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు.

ఆరు గ్యారెంటీల కోసం దరఖాస్తుల స్వీకరణ

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీ సంక్షేమ పథకాల్లో భాగంగా గృహ జ్యోతి, మహాలక్ష్మి పథకాలకు దరఖాస్తు చేసుకోని పట్టణ ప్రజలందరూ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గంధ్రత్ రమణ, అబ్రార్, కోఆప్షన్ సభ్యుడు చిలుక రమణ ఉన్నారు.

నేడు జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

నిర్మల్‌చైన్‌గేట్, మార్చి 4: జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన మంగళవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి ఎర్రపత్తి రమేశ్, జిల్లా విద్యాధికారి రవీందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా మహిళా శిశు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, మిషన్‌శక్తి, విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా నిర్మల్ ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఉదయం 10 గంటలకు జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు హాజరు కానున్నట్లు వెల్లడించారు.

రైతులు ఈ-కేవైసీ చేసుకోవాలి

ఖానాపూర్, మార్చి 4: పీఎం కిసాన్ సమ్మాన్ యోజన పథకం కోసం అర్హులైన రైతులు ఈ-కేవైసీ చేసుకోవాలని ఖానాపూర్ మండల ఏవో ఆసం రవి తెలిపారు. సోమవారం వ్యవసాయశాఖ కార్యాలయంలో రైతుల వివరాలను ఈ-కేవైసీ చేశారు. కేంద్రం నుంచి ఏటా రూ.6 వేలు లబ్ధిపొందడానికి ఈ కేవైసీ చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు క్లస్టర్ ఏఈవోలను సంప్రదించాలన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కుంటాల, మార్చి 4 : వెంకూర్ గ్రామపంచాయతీలో సీసీ రోడ్డు పనులను ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జుట్టు అశోక్, గ్రామ ప్రత్యేకాధికారి ఎజాజ్ అహ్మద్ ఖాన్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు మగ్గిడి దిగంబర్, జలన్న, సుధాకర్, బాజీరావు, అశోక్, పంచాయతీ కార్యదర్శి అరుణ తదితరులు ఉన్నారు.

గోవింద స్వామి ఆలయ వార్షికోత్సవం

సోన్, మార్చి 4: నిర్మల్ మండలం చిట్యాల స్వర్ణ నది పక్కన గల శ్రీ సంతానవర గోవిందస్వామి ఆలయ 14వ వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేద పండితులు గురుమంచి చంద్రశేఖర్, శ్రీపవన్‌ద్వివేది ఆధ్వర్యంలో మహాగణపతిపూజ, పుణ్యాహవచనము, రక్షాబంధనపూజ, అఖండ దీపారాధన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మూడు రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ, వీడీసీ సభ్యులు తెలిపారు. మంగళవారం స్వామి వారి కల్యాణోత్సవం, అన్నదానం ఉంటుందని పేర్కొన్నారు.

గ్రూపు పరీక్షల శిక్షణకు దరఖాస్తులు

నిర్మల్ టౌన్, మార్చి 4: జిల్లాలో సాంఘిక సంక్షేమశాఖ ద్వారా నిర్వహిస్తున్న ఎస్సీ స్టడీ సర్కిల్లో గ్రూపు 2, 3, 4 అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు ఆశాఖ అధికారి రాజేశ్వర్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలలు నిర్వహించే ఈ శిక్షణ తరగతులకు హాజరయ్యే వారు ఈ నెల 6 లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి

కుంటాల, మార్చి, 4 : కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరణ చేయాలని కోరుతూ జిల్లాలోని ఉద్యోగులు తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్ ఈయూ) ఆధ్వర్యంలో ఈ మెయిల్ ద్వారా పీఆర్‌సీ కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సీపీఎస్ రద్దు చేయాలని ఈ మెయిల్ ద్వారా జిల్లాలోని వేలాది మంది ఉద్యోగులు విజ్ఞప్తులు పంపినట్టు జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు పేర్కొన్నారు.

ప్రధాని సభకు తరలిన నాయకులు

కుంటాల, మార్చి 4 : ఆదిలాబాద్ పట్టణంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ సభకు బీజేపీ మండలాధ్యక్షుడు గుద్దేటి నర్సయ్య ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో బీజేపీ శ్రేణులు తరలివెళ్లాయి. కల్లూరు జాతీయ రహదారిపై ఆగి నినాదాలు చేస్తూ ఆదిలాబాద్ వైపు వాహనాల్లో తరలివెళ్లారు.

అందుబాటులో ఎరువులు

ముధోల్, మార్చి, 4 : ముధోల్ ప్రాథమిక సహకార సంఘం, బాసర, బోరిగాం గోదాముల్లో యూరియా, 20-20, 0-13తో పాటు 12, 32, 16 ఎరువులు అందుబాటులో ఉన్నాయని సొసైటీ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావాల్సిన రైతులు ఆధార్ కార్డు తీసుకొని కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

కొనసాగుతున్న సప్తాహం

ముధోల్, మార్చి 4 : ముధోల్ పశుపతినాథ్ శివాలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సప్తాహం కొనసాగుతున్నది. సోమవారం మూడోరోజు మహారాష్ట్రతో పాటు మండలంలోని గ్రామాల నుంచి వచ్చిన భజన దిండులు సప్తాహంలో పాల్గొని కీర్తనలు, భజనలు చేశారు. వేకువజామున మహిళలు హారతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులంతా సప్తాహంలో పాల్గొనాలని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు.

పెండింగ్ దరఖాస్తుల పరిశీలన

సారంగాపూర్, మార్చి 4: బీరవెల్లి, బోరిగాం గ్రామాల్లో ధరణి పెండింగ్ దరఖాస్తులను తహసీల్దార్ శ్రీదేవి సోమవారం పరిశీలించారు. బీరవెల్లిలో 16, బోరిగాంలో 12 మొత్తం 28 దరఖాస్తులను పరశీలించామని తహసీల్దార్ తెలిపారు. ఇక్కడ డీటీ రవీందర్, ఆర్ఐలు ముంతాజ్, వెంకట నర్సయ్య ఉన్నారు.

గృహ సోలార్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కుంటాల, మార్చి 4 : ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకానికి మార్చి 8 లోగా దరఖాస్తు చేసుకోవాలని సబ్‌పోస్ట్ మాస్టర్ మధకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్సిడీపై అందించే ఈ సోలార్ ప్యానెల్స్‌కు కరెంటు బిల్లు, ఫోన్ నంబరు, ఇంటిపై కప్పు ఫొటోతో స్థానిక పోస్ట్ ఆఫీసులో నమోదు చేసుకోవచ్చని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నర్సరీల పెంపకంపై అలసత్వం వద్దు

దస్తురాబాద్, మార్చి4 : నర్సరీల పెంపకంపై అలసత్వం చూపవద్దని ఎంపీడీవో రమేశ్ తెలిపారు. పెర్కపల్లిలో సోమవారం నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్డు, ఎరువుల తయారీని పరిశీలించి మాట్లాడారు. ఇక్కడ తయారు చేసిన ఎరువులను మొక్కలకు అందించాలని సూచించారు. ఇక్కడ పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

పబ్లిక్ స్కూల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

నిర్మల్ టౌన్, మార్చి 4: పబ్లిక్ స్కూల్లో ప్రవేశాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన శాఖ అధికారి అంబాజీనాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని రామంతాపూర్, బేగంపేట ఇంగ్లిష్ మీడియం పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలకు గిరిజన విద్యార్థులు ఈ నె 14 లోపు దరఖాస్తులు అందించాలని సూచించారు. విద్యార్థుల తల్లిండ్రుల ఆదాయం గ్రామీణ ప్రాంతంలో రూ.2 లక్షలు, పట్టణ ప్రాంతంతో రూ.1.50 లక్షలుం ఉన్నవారు అర్హులని తెలిపారు. పుట్టిన తేదీ, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్ట్ ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. లక్కీ డ్రా ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తారని వెల్లడించారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

అలేఖ్య హత్య కేసు నిందితుడిని శిక్షించాలి



అలేఖ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఖానాపూర్ టౌన్, మార్చి 4: ప్రేమ పేరుతో వేధింపులకు గురి చేసి గత నెల 8న అంబేద్కర్‌నగర్ కాలనీకి చెందిన శెట్పెల్లి అలేఖ్యను పట్టపగలే అతిదారుణంగా హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన బాధిత కుటుంబాన్ని పరామర్శించి మాట్లాడారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితుడితో పాటు సహకరించిన వారందరికీ కఠిన శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం తరపున బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇక్కడ గొర్రె గంగాధర్, శనిగారపు శ్రావణ్, కొక్కుల ప్రదీప్, పాల సంతోష్, శాబీర్‌పాషా, కట్ట శ్రీనివాస్, గొరీకర్ రాజు, శ్రీహరి ఉన్నారు.

పంటలను పరిశీలిస్తున్న విశిష్ట ఇంపల్స్ విద్యార్థులు

విద్యార్థుల క్షేత్ర సందర్శన

నిర్మల్ అర్బన్, మార్చి 4 : విద్యార్థులకు చదువుతో పాటు క్షేత్ర సందర్శన ఎంతో దోహదం చేస్తుందని వశిష్ట ఇంపల్స్ ఈ టెక్నో పాఠశాల చైర్మన్ గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సోమవారం పాఠశాల విద్యార్థులు కౌట్ల(బీ) గ్రామంలో వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పంటల సాగు, దిగుబడిని రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చెరువు తూము గేటుకు మరమ్మతులు చేయాలి

ప్రజావాణిలో రైతుల సమస్యను వింటున్న తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్

కుంటాల, మార్చి, 4 : మండల కేంద్రంలో దౌనెల్లి రోడ్డు వైపు గల బూర్గుకుంట చెరువు తూము గేటుకు మరమ్మతు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో తహసీల్దార్‌కు రైతులు వినతిపత్రం అందజేశారు. ఆయకట్టు కింద వరి, మక్క అధికంగా పండిస్తారని, గేటు పనిచేయకపోవడంతో సాగునీరందక పంటనష్టం వాటిల్లుతుందని వాపోయారు. చెరువు గట్టులపై ఇరువైపులా పొదలు పెరుగడంతో దారి వెంబడి నడవడానికి కష్టంగా ఉందని వివరించారు. దీంతో స్పందించిన తహసీల్దార్ సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. మరో రైతు పట్టా పాస్‌బుక్‌లో భూ విస్తీర్ణం తప్పిదంతో బ్యాంకులోను, రైతు బంధు లబ్ధి పొందలేకపోతున్నానని, సమస్యను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో రహీం, డీటీ నరేశ్‌గౌడ్, ఏపీవో నవీన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీవిశారద, ఏపీఎం అశోక్, ఏఈవో మహేశ్ పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించు కోవాలి

కుభీర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

కుభీర్, మార్చి 4 : 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని నెహ్రూ యువకేంద్ర సంఘటన్ సమన్వయకర్త బంక కిరణ్ పేర్కొన్నారు. సోమవారం ఎన్‌వైకేఎస్ ఆధ్వర్యంలో అన్నాబావుసాఠే కూడలిలో ఓటర్ అవేర్‌నెస్ ప్రోగ్రాం నిర్వహించి మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదన్నారు. ఎన్నికల్లో అర్హులందరూ ఓటు వేసేలా యువకులు కృషి చేయాలని సూచించారు. ఛత్రపతి యూత్ అధ్యక్షుడు అభిషేక్, నాయకులు వివేకానంద, పీరాజీ, బాబు, కళ్యాణ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలి

- డీఈవో రవీందర్ రెడ్డి

నిర్మల్ అర్బన్, మార్చి 4 : విద్యారంగంలో వస్తున్న నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థుల వరకు చేర్చాలని డీఈవో డాక్టర్ రవీందర్ రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం పట్టణంలోని కస్బా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టంను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సిస్టంలో అన్ని తరగతుల సబ్జెక్టులకు చెందిన పాఠ్యాంశాలు ఇన్‌స్టాల్ చేసి ఉండడంతో విద్యార్థులకు అర్థవంతంగా బోధించవచ్చన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో శంకర్, హెచ్ఎం ప్రవీణ్, వాణి తదితరులున్నారు.



లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టంను ప్రారంభిస్తున్న డీఈవో

ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు

కడెం, మార్చి 4: ఉమ్మడి బెల్లాల్ పంచాయతీ ఈజీఎస్ క్షేత్రసహాయకుడు (ఎఫ్ ఏ)పై సోమవారం గ్రామ పంచాయతీ పరిధిలోని కూలీలు, ప్రజలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కొంతకాలంగా కూలీల వద్ద డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, వారానికి రూ. వెయ్యి చొప్పున ఇచ్చిన వారికి పనికి రాకపోయినా హాజరు వేస్తూ, కూలీకి వెళ్లిన వారికి మాత్రం హాజరు వేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఫీల్డ్ అసిస్టెంట్ తుప్ప రాజలింగం స్థానంలో ఆయన కుమారుడు ఎఫ్ఏగా చెలమణి అవుతూ కూలీలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మస్టర్లపై తండ్రికి బదులు కొడుకు ప్రశాంత్ సంతకాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయమై సంబంధిత అధికారులను వివరణ కోరగా తమకు సైతం ఫిర్యాదు అందినట్లు వెల్లడించారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మీరాబాయికి సన్మానం

భైంసా, మార్చి 4: ఇటీవల వెలుబడిన టీజీటీ ఫలితాల్లో ఉద్యోగం సాధించిన మీరాబాయిని సోమవారం సన్మానించారు. ఇక్కడ ఆరె మరాఠా సంఘం గౌరవాధ్యక్షుడు జాదవ్ పుండలిక్‌రావు పాటిల్, శ్రీ మేధా హైస్కూల్ డైరెక్టర్ సింధే ప్రేమానంద్, ప్రిన్సిపాల్ సింధే సాయినాథ్, జాదవ్ రాందాస్ పాటిల్, దేవిదాస్ పాటిల్, వరలక్ష్మి తదితరులు ఉన్నారు.

సేవా కార్యక్రమాలు

పెంబి, మార్చి 4: సేవా కార్యక్రమాల ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, పాకాల ఫౌండేషన్ చైర్మన్ పాకాల రాంచందర్ అన్నారు. సోమవారం తన కూతురు జన్మదినం సందర్భంగా పెంబి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మినరల్ వాటర్ పంపిణీ చేసి మాట్లాడారు. గతంలో పాఠశాల మరమ్మతులకు నిధులు, స్పోర్ట్స్ కిట్లు అందజేశానని గుర్తు చేశారు. ఈ సందర్భంగా రాంచందర్‌ను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. హెచ్ఎం రాంచందర్, వీడీసీ అధ్యక్షుడు నర్సయ్య, స్వప్నిల్‌రెడ్డి ఉన్నారు.

సదుపాయలేవీ..?

నిర్మల్ టౌన్, మార్చి 4: జిల్లా కేంద్రంలోని వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల కోసం కాంట్రాక్టు పద్ధతిన నియమించేందుకు దరఖాస్తులను ఆహ్వానించగా దరఖాస్తుదారులు సోమవారం కలెక్టర్ కార్యాలయానికి తరలివచ్చారు. జిల్లా వైద్యాధికారి కార్యాలయం వద్ద కౌంటర్‌ను ఏర్పాటు చేసిన అధికారులు బయట దరఖాస్తులను రాసేందుకు ఎటువంటి కుర్చీలు, టేబుళ్లు ఏర్పాటు చేయకపోవడంతో చంటి పిల్లలతో కలిసి వచ్చిన మహిళా అభ్యర్థులు నేలపైనే దరఖాస్తులు రాశారు. కలెక్టర్ కార్యాలయంలో ఎండలు మండుతున్న నేపథ్యంలో తాగునీరు లేక అభ్యర్థులు ఇబ్బందులకు గురయ్యారు.

పోచమ్మకు వెండి త్రిశూలం బహూకరణ

ఆలయ అర్చకుడు, కమిటీ సభ్యులకు వెండి త్రిశూలం అందజేస్తున్న దాతలు

ఖానాపూర్ టౌన్, మార్చి 4 : ఖానాపూర్ పట్టణానికి చెందిన సీజీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు చింతపండు రవి, కడార్ల వెంకటేశ్ దంపతులు సోమవారం ముత్యాల పోచమ్మకు కిలో వెండి త్రిశూలాన్ని వితరణ చేశారు. ఆలయ అర్చకుడు నిమ్మగడ్డ శరత్‌శంద్ర, ఆలయ కమిటీ అధ్యక్షుడు కొండాడి నాగేందర్ సమక్షంలో త్రిశూలాన్ని అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ అంకం రాజేందర్, బీసీ రాజన్న, అంకం నాగరాజు, చింతపండు శ్రీనివాస్, కడకుంట్ల రవి, రంజిత్‌రావు, కతులాపురం శంకర్, కౌట మహేశ్, సింగు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కాల్వలో మహా శివరాత్రి జాతరకు ఏర్పాట్లు

దిలావర్‌పూర్, మార్చి 4: శివరాత్రి సందర్భంగా భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని కాల్వ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్ పూజారం మహేశ్ పేర్కొన్నారు. సోమవారం కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం వద్ద పాలక మండలి, కాల్వ గ్రామస్తులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయానికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తారని చెప్పారు. ఆలయ సమీపంలో వాహనాలు నిలుపుకునేందుకు పార్కింగ్ స్థలం ఏర్పాటుచేశామని చెప్పారు. ఆలయం వరకు వాహనాలను తీసుకురావద్దని సూచించారు. శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండల సభ్యులు పూదరి శివ, గుమ్ముల చిన్ననర్సయ్య, ప్రీతంరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అర్చకులు రామ, శ్రీనివాస్, వెంకటేశ్, ఆలయ అసిస్టెంట్ మాధవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

శివరాత్రి ఏర్పాట్లపై చర్చిస్తున్న చైర్మన్,పండితులు

కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

ఖానాపూర్, మార్చి 4: ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పొరేటర్లకు కొమ్ము కాస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి టీ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని పీఆర్‌టీయూ భవనంలో జరిగిన సమావేశంలో రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పది సంవత్సరాలుగా రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తోందని ఆరోపించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మోదీ ప్రభుత్వానికి ఓటుతో సమాధానం చెప్పాలని సూచించారు. డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేశ్, జిల్లా కార్యదర్శి రాజు, నాయకులు లక్ష్మణ్, వెంకటేశ్, స్వామి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి గాయాలు

సారంగాపూర్, మార్చి 4: మండలంలోని జామ్ గ్రామానికి చెందిన మయ్యారి రమేశ్‌కు రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన ప్రకారం.. రమేశ్ సోమవారం రాత్రి సాయినగర్‌కు వెళ్లాడు. పని ముగించుకొని తిరిగి వస్తుండగా శ్రీమల్లికార్జున పెట్రోల్ బంక్ సమీపంలో బైక్‌పై నుంచి కిందపడి తలకు, ముఖానికి బలమైన గాయాలు కావడంతో తీవ్రంగా రక్తస్రావమైంది. స్థానికులు గమనించి 108కు సమాచారం అందించగా వారు వచ్చి నిర్మల్ దవాఖానకు వాహనంలో తరలించారు. రమేశ్ బైక్ అదుపుతప్పి కిందపడి పోయాడా లేదా ఎవరైనా బైక్‌కు ఢీకొట్టి వెళ్లిపోయారా అని కుటుంబ సభ్యులు అనుమానా